క్లుప్తంగా

స్వచ్ఛాంధ్రపై అవగాహన కలిగించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, అవగాహన కలిగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం వీఎంసీలోని వివిధ శాఖాధిపతులు, అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శనివారం జరగబోయే కార్యక్రమం పకడ్బందీగా జరగాలని, ప్రజలకు ఈ–వేస్ట్‌పై అవగాహన కల్పించాలన్నారు.

నత్తనడకన డ్రెయిన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శివాలయం సమీపంలో మురుగుకాలువ పనులు నత్తనడకన సా..గుతున్నాయి. ఐదు రోజులుగా రోడ్డును తవ్వి పనులు చేస్తున్నారు. దీంతో ఈ దారిలోని కోదండ రామాలయం, శివాలయం, గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాల, పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇటుగా వెళ్లే వారు అవస్థ పడుతున్నారు. అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచి రాకపోకలు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రన్ ఫర్ జీసెస్

పటమట(విజయవాడతూర్పు): ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని ఫెడరేషన్ ఆఫ్ చర్చ్‌స్, అన్ని క్రైస్తవ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద ఉన్న సెయింట్ పాల్స్ కథెడ్రల్ నుంచి రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయవాడ కేథలిక్ డయోసిస్ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, కృష్ణాగోదావరి డయోసిస్ బిషప్ తంటిపూడి జార్జి కొర్నోలియస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రన్‌ఫర్ జీసెస్ శనివారం ఉదయం 6 గంటలకు బెంజిసర్కిల్ వద్ద ఉన్న సెయింట్‌పాల్స్ కథెడ్రల్ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

26 నుంచి ఏఐఎస్‌ఎఫ్ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు కడపలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ తెలిపారు. హనుమాన్‌పేటలోని సీపీఐ భవన్‌లో శుక్రవారం శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తల్లికి వందనంలో ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులలో అన్ని అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, జగదీష్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక వాసవి సేవా సంఘంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్రం కృష్ణలంక శాఖ ఆధ్వర్యాన ఈ నెల 20వ తేదీ ఉదయం 6.30 గంటలకు 963వ నూతన ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు బోధక యోగాచార్యులు పోకూరి గోవర్ధనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. 8 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 98481 53417, 99127 93312 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): రెండు రోజుల నుంచి తండ్రి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవరపు నాగసాయికుమార్ తండ్రి వీరబ్రహ్మాచారి (55) నున్న గ్రామంలోని ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో బ్రాంచి ఇన్‌చార్జిగా పని చేస్తుంటాడు. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. అప్పులు ఎక్కువగా ఉన్నాయి నేను వెళ్లిపోతున్నానని ప్యాంటు జేబులో లెటర్ పెట్టాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు నాగసాయికుమార్ ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఈ పచ్చదనం మాకొద్దు బాబోయ్!



30వ డివిజన్‌లోని ఖాళీ స్థలంలో పెరిగిన జమ్ము, పిచ్చి మొక్కలు



ఖాళీప్రాంతంలో నిలిచిన మురుగునీరు

- 30వ డివిజన్‌లో దోమలకు ఆవాసంగా ఖాళీ స్థలాలు
- దోమల నివారణ చర్యలు అంతంతమాత్రం
- ఖాళీ స్థలాలు మెరక చేసేదెప్పుడో!

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కనిపిస్తున్న పచ్చదనం.. ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ దోమలు అధికమవుతుండటంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఈ ప్రాంతంలో జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, దేవీనగర్, గుణదల వెళ్లే రోడ్డు తదితర ప్రాంతాల్లోని ఖాళీస్థలాలు దోమలకు ఆవాస కేంద్రంగా మారాయి.

ఖాళీ స్థలాల్లో నిలుస్తున్న మురుగు

ఈ ప్రాంతాల్లో మురుగు కాలువలు సైతం సక్రమంగా లేవు. దీంతో వాడుకనీటితోపాటు వర్షం నీరు బయటకు పోయే దారి లేదు. ఖాళీ స్థలాల్లో మురుగు, వర్షం నీరు నిలిచి దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఇక్కడ కాలాలు, రుతువులతో సంబంధం లేకుండా 365 రోజులూ దోమల బెడద తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోజంతా కష్టపడి ఇంటికి వచ్చిన తర్వాత కంటిపై కునుకు కూడా కరువవుతోందంటున్నారు. దోమల బాధతో తరచూ అనారోగ్యం బారిన పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని కాలువలు

ఈ ప్రాంతంలో ఎక్కడో ఒకటి రెండు రోడ్లలో తప్ప తక్కిన ప్రాంతాల్లో మురుగు కాలువలు లేవు. ఎవరికి వారు తమ ఇంటిముందు కాలువల ఏర్పాటుతో పాటు వాడిన నీటిని ఖాళీస్థలాల్లోకి వదిలివేస్తున్నారు. ముక్కు పిండి మరీ పన్నులు వసూలు చేసే అధికారులు మురుగు కాలువలు నిర్మించాలని ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్పాల సంచారం

ఈ ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో మురుగు, చెత్తాచెదారంతోపాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. గతంలో స్వచ్ఛ భారత్ పేరిట పరిసరాలు శుభ్రం చేసే వారు ప్రస్తుతం అటువంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఈ ప్రాంతంలో సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెరక చేయించడంలో విఫలం

ఖాళీ స్థలాలను మెరక చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఖాళీ స్థలాలను మెరక చేయించాలని అధికారులకు ఎన్నిమార్లు కోరినా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. దీనికి పక్కనే బుడమేరు ఉండటంతో దోమలు మరింతగా విజృంభిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతి మార్గంలో పయనించాలి



సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యాన పరిశుద్ధ సిలువ మార్గం



మధురానగర్‌లో ప్రత్యేక ప్రార్థనలు

- కార్మెల్ నగర్ విచారణ గురువులు ఫాదర్ బుర్రి జాన్‌పీటర్
- ఘనంగా గుడ్ ఫ్రైడే

గుణదల (విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో పయనించాలని కార్మెల్ నగర్ విచారణ గురువులు ఫాదర్ బుర్రి జాన్‌పీటర్ చెప్పారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు శుక్రవారం జరిగాయి. వందలాది మంది క్రైస్తవులు ప్రధానాలయం నుంచి కొండ శిఖరాగ్రం వరకు సిలువ యాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. మానవులను రక్షించేందుకే క్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని తెలిపారు. సిలువ త్యాగాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దివ్యబలిపూజ..

పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సమష్టి దివ్యబలి పూజ చేశారు. రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం రాజు భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. ఎడ్యుకేషనల్ డెస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలగాని మరియన్న, సహాయ గురువులు బాలస్వామి, ఫాదర్ ప్రతాప్, మఠకన్యలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్ హోసన్న ప్రార్థన మందిరం, క్రీస్తుసంఘం, కృపామినిస్ట్రీస్, పలు ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

సింగ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): లోక రక్షణకు ఏసుక్రీస్తు ప్రాణాలు అర్పించిన రోజుకు గుర్తుగా జరుపుకునే గుడ్ ఫ్రైడేను విశ్వాసులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. న్యూరాజరాజేశ్వరీపేట, సింగ్‌నగర్, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లోని పలు చర్చిల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉపవాస ప్రార్థనలు చేశారు. సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు, దీక్షా పరులు సిలువ మోస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- ఏసుక్రీస్తు సిలువతో ప్రాణాలను అర్పించారని మిస్పా పరిచర్యలు సంఘ కాపరి బ్రదర్ అభిషిక్త్ శ్యామ్యేల్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా వాంబేకాలనీలోని ఆ చర్చిలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుడ్ ఫ్రైడే సందర్భంగా మధురానగర్, పసుపుతోట, దేవీనగర్, రామకృష్ణాపురం, ముత్యాలంపాడు, గులాబీతోట, మాచవరం, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అజిత్‌సింగ్‌నగర్ గిడియోను మందిరం క్రీస్తు మార్గం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. పాస్టర్ ఎస్ అజయ్‌బాబు గుడ్ ఫ్రైడే, క్రీస్తు సందేశం వివరించారు. మధురానగర్ కొబ్బరితోటలో జీసెస్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఫెలోషిప్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మానవాళి సంక్షేమానికి క్రీస్తు త్యాగం చేశారన్నారు.

నరసరాజు రోడ్డులో..

మధురానగర్ వీవీనరసరాజు రోడ్డులో ఇమ్మానుయేల్ చర్చిలో బిషప్ కనపర్తి ప్రభాకర్‌రావు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. మానవాళి కోసం క్రీస్తు చేసిన త్యాగాలను తెలుసుకుని సన్మార్గంలో నడవాలని సూచించారు.



గిడియోను మందిరం క్రీస్తు మార్గం చర్చిలో మల్లాది విష్ణు



గుణదల మేరిమాత ఆలయంలో..

అంబేడ్కర్ కాలనీలో ..

అంబేడ్కర్ కాలనీ షీయోను ప్రార్థన మందిరంలో గుడ్‌ఫ్రై డే ప్రార్థనలు జరిగాయి. డాక్టర్ కనమాల వరప్రసాద్ మాట్లాడుతూ గుడ్‌ఫ్రై డే అనగా క్రీస్తు మానవాళికోసం ఆయనకు శిలువ వేసిన రోజన్నారు.



మేరిమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్స్



గుణదల కొండపై సిలువమార్గంలో మఠకన్యలు



వాంబేకాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మిస్పా పరిచర్యలు సంఘ పెద్దలు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు, తీగలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని అపార్ట్‌మెంట్స్ వెనుక భాగంలో విద్యుత్ స్తంభాలు.. తీగలు ప్రమాదకరంగా మారాయి. బుడమేరు వరదల తర్వాత ఇక్కడి తెలుగు బాప్టిస్ట్ చర్చి.. వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలోని రోడ్లలో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి పడేలా కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ తీగలు చిందరవందరగా కిందకు వేలాడుతూ ఉన్నాయి. ఇవి ఎప్పుడు తెగి కిందకు పడతాయేమో అని ఈ ప్రాంతాలవాసులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో సిబ్బందికి సమస్యను పలుమార్లు వివరించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీటిని సరి చేయించాల్సి ఉంది.



తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్ద పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో ..

రేపు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై సదస్సు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వంటింటి వ్యర్థాలతో కూరగాయలు పెంచటం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై భవానీపురంలో దేసు సుబ్బారావు వెంకట నాగరత్నమ్మ వాసవి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సదస్సు నిర్వహించనున్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సీటీజీ) ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు ఏపీఎఫ్‌సీసీఐ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు అధ్యక్షత వహించనున్నారు. ఈ మేరకు సీటీజీ విజయవాడ టీమ్ పీవీడీ నాగేశ్వరరావు, గూడవల్లి సురేష్‌బాబు, నర్రా నాగేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్యాంక్ డిపాజిట్ దారులందరికీ న్యాయం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన ఖాతాదారులందరికీ న్యాయం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ 96 సంవత్సరాల చరిత్ర గలిగిన పాతబస్తీలోని దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ లైసెన్సును రద్దు చేస్తూ ఆర్‌బీఐ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఐదు లక్షల లోపు డిపాజిట్ దార్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (ఈఐఈఏఈ) ద్వారా చెల్లించడం మంచిదేనన్నారు. బ్యాంక్‌కు చెందిన రూ.67 కోట్ల డిపాజిట్లు జాతీయ బ్యాంకులు, గవర్నమెంట్ సెక్యూరిటీస్‌లో ఉండగా, మొత్తం 11 వేల డిపాజిటర్లకు బ్యాంకు చెల్లించవలసినది సుమారు రూ.56 కోట్లు మాత్రమేనన్నారు. మొత్తం అందరికీ చెల్లించగా ఇంకా మిగిలే ఉంటుందన్నారు. ఐదు లక్షలపై నుంచి సుమారు రూ.50 లక్షల వరకు డిపాజిట్ దారులు 298 మందికి చెల్లించవలసినది రూ.30 కోట్ల లోపు మాటేనన్నారు. డిపాజిట్ దారుల ఆందోళన తొలగించవలసిందిగా కోరారు.

‘వక్ఫ్ సవరణ’ రద్దు చేసి రాజ్యాంగాన్ని కాపాడాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసి రాజ్యాంగాన్ని కాపాడాలని మస్జిదె ఉమర్ ఫారూఖ్ అహలె సున్నత్‌వుల్ జమాత్ కమిటీ అధ్యక్షుడు దావూద్ అలీబేగ్(భాషా), ఇమామ్ హజీజుర్ రెహమాన్ అన్నారు. 20వ డివిజన్ హైస్కూల్ రోడ్డులోని మసీదు ఎదుట శుక్రవారం ముస్లింలు, మతపెద్దలు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేతికి నల్లరిబ్బన్లు కట్టుకుని శాంతియుత నిరసన తెలిపారు. వక్ఫ్‌ను రక్షించండి–రాజ్యాంగాన్ని కాపాడండి, వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దావూద్ అలీబేగ్, రెహమాన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర రాజకీయ నాయకులు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కోరారు. బిల్లును రాష్ట్రంలోని ముస్లింలు వ్యతిరేకించాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు తరఫున విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు ఉమర్ అలీ, కార్యదర్శి ఇన్‌య్‌తుల్లా, కోశాధికారి ఫారూఖ్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

- రాణిగారితోటలోని మసీద్ ఎ దారుస్సలామ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. మసీద్ కమిటీ ప్రెసిడెంట్ నాగుల్‌మీరా, బాబూలాల్, హసన్, కాశిం తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ఎన్డీఏ ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్యనగర్ లోని మసీద్ వద్ద నమాజ్ పూర్తయిన తర్వాత నిరసన వ్యక్తం చేశారు. ముస్లింలు ప్లకార్డులు చేపట్టి వక్ఫ్ ఆస్తులను రాజకీయం చేయడం ఆపాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



నల్లరిబ్బన్లు కట్టుకుని శాంతియుత నిరసన తెలుపుతున్న ముస్లిం సోదరులు



సుందరయ్యనగర్లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్ సీతారామపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 19వ తేదీ శనివారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

సూర్యారావుపేట ఫీడర్ పరిధిలో..

కొత్త వంతెన రోడ్డు, కాట్రగడ్డ వారి వీధి, బోడేపూడి వారి వీధి, దుర్గా అగ్రహారం కాలువ గట్టు, అంకమ్మ తల్లి గుడి ఏరియా

గీతామందిర్..

చుట్టుగుంట రైవస్ కాలువగట్టు, సీతారామపురం కాలువగట్టు, లాల్‌బహాదూర్ శాస్త్రి వీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ రోడ్డు, కాకానినగర్, గీతామందిర్ రోడ్డు, మేదర బజారు, కోటిలింగాలవారి వీధి, నెహ్రూ స్ట్రీట్, చాఫరాల వారి వీధి, ఐనవోలు వారి వీధి, రామా కార్పొరేషన్ ఏరియా, శాతవాహన కాలేజీ వెనుకవైపు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఏరియా.

సత్యసాయి...

మల్లెల శ్రీరామమూర్తి వీధి, కొల్లిపర వారి వీధి, వీరమాచినేని వారి వీధి, వారణాసివారి వీధి, ఏలూరురోడ్డు సీతారామపురం సిగ్నల్స్ ఏరియా.

మారుతీనగర్..

మారుతీ నగర్ కాలువ గట్టు, సిమెంట్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కాకర్ల వారి వీధి, వీరయ్య వీధి, మాగంటి వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సందేశాత్మకంగా సాంఘిక నాటికలు

విజయవాడ కల్చరల్: పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్, ఏపీ చలన చిత్ర వాణిజ్యమండలి సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 44వ జాతీయ సాంఘిక నాటకోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. నటరాజ్ డెమోక్రటిక్ అసోసియేషన్ పెందుర్తి వారు చీమాచీమా ఎందుకు కుట్టావ్ నాటికను ప్రదర్శించారు. రచన రావి నాగేశ్వరరావు, దర్శకత్వం పిళ్లా సన్యాసిరావు. యువత దేశ భవిష్యత్‌లో భాగస్వాములు కావాలని దిశా నిర్దేశం లేకుండా గడపకూడదనే సందేశంతో నాటకం సాగుతుంది. గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మచెక్కిన బొమ్మలు నాటికను ప్రదర్శించారు. రచన జ్యోతిరాజ్, వెంకట్‌గోవాడ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో పీఎంకేఎం వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకటరమణ, అమృత వర్షిణి, గుడివాడ లహరి పాల్గొన్నారు. సినీ, రంగస్థ నటుడు కొప్పుల ఆనంద్ పర్యవేక్షించారు.



చీమాచీమా ఎందుకుకుట్టావ్ నాటికలోని ఓ సన్నివేశం

జీజీహెచ్‌కి వీల్‌చైర్‌లు అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వాస్పత్రికి మూడు వీల్‌చైర్‌లు, నాలుగు సెలైన్ స్టాండ్‌లను అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం రోటరీ ప్రతినిధులు శ్రీదేవి, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య వాటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కామినేని పట్టాభిరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో ఎంతోమంది పేదలు నడవలేని స్థితిలో వస్తుంటారన్నారు. వారికి ఉపయోగపడేలా వీల్‌చైర్‌లు, వార్డులో ఉన్న వారి కోసం సెలైన్ స్టాండ్స్ అందించినట్లు తెలిపారు. రోటరీ ప్రతినిధులకు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు. రోటరీ వారితో గ్రేడ్ వన్ ల్యాబ్ టెక్నీషియన్లు పి.నాగరాజు, గ్రేడ్ 2 ల్యాబ్ టెక్నీషియన్ వై.శ్రీనివాసరావు సమన్వయం చేసి ఆస్పత్రికి వాటిని అందచేసేలా కృషి చేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు లీలాప్రసాద్, బిందుమాధవ్, ప్రసాద్ పాల్గొన్నారు.



జీజీహెచ్‌కి వీల్‌చైర్స్, సెలైన్ స్టాండ్స్ అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో జరిపే బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే మెడికల్ క్యాంపును విజయవాడలో నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్యలు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డీఈవోలను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఈ వేసవి సెలవుల్లో జరిగే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, దివ్యాంగులు తదితరులను గుర్తించడానికి ఈనెల 24, 25, 26 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జనరల్ హాస్పిటల్‌లో ప్రభుత్వం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులులో ఉమ్మడి కృష్ణా జిల్లాలో బందర్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. కానీ ఉపాధ్యాయ బదిలీల విధానం కౌన్సెలింగ్ సిస్టమ్ ద్వారా జరుగుతున్న 1998 నుంచి విజయవాడలో సైతం మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి క్యాంపులు జరుపుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, దివ్యాంగులు సర్టిఫికెట్ తెచ్చుకొను నిమిత్తం చాలా వ్యయ ప్రయాసలు పడి 24, 25, 26 తేదీల్లో మచిలీపట్నం వెళ్లవలసిన పరిస్థితి ఉందన్నారు. దీనివలన తీవ్రమైన ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి బందర్‌తో పాటుగా విజయవాడలోనూ మెడికల్ క్యాంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

- ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయకు చెందిన కళాకారులు శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై గేయ అక్షిత పర్యవేక్షణలో 22మంది చిన్నారులు నృత్యప్రదర్శన ఇచ్చారు. పంచహారతుల అనంతరం కళావేదికపై చిన్నారులు నృత్యప్రదర్శన జరిగింది.